క్లుప్తంగా

మంత్రిని కలిసిన మాజీ మంత్రి మహ్మద్ షాకీర్



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో మాజీ మంత్రి మహ్మద్ షాకీర్

కదిరి అర్బన్: రాష్ట్ర అటవీ భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మంగళవారం విజయవాడలో కదిరికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, మాజీ మంత్రి మహ్మద్ షాకీర్ మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మహ్మద్ షాకీర్ తనయుడు షాకీబ్, న్యాయవాది పఠాన్ జాఫర్‌ఖాన్ ఉన్నారు.

అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ రఫినాయక్

తలుపుల: మండల అభివృద్ధికి అధికారులు, సభ్యులు సహకరించాలని ఎంపీపీ ఎస్. రఫినాయక్ సూచించారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం మండల సమావేశం జరిగింది. వివిధ శాఖల పరిధిలో జరిగిన అభివృద్ధి పనులను అధికారులు సమావేశం దృష్టికి తెచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ పథకాలను లబ్ధిదారుల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. ఏఓ షాదాబ్ మాట్లాడుతూ ఈక్రాప్ బుకింగ్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రీ సర్వే, అసైన్‌మెంట్ భూములపై తహసీల్దార్ శ్రీధర్ సభ్యులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మగ్బుల్ బాషా, ఏఓ రామానాయక్, వైస్ ఎంపీపీలు ఓబుళేశ్వరి, మహేష్ రెడ్డి, సీడీపీఓ రాధిక, ఎంఈఓ వెంకట్రాముడు, వైద్యాధికారిణి సల్మా, ఈఓఆర్డీ శకుంతల, ఈఓ మాధవరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



నగదు అందిస్తున్న సర్పంచ్

గాండ్లపెంట: కురుమామిడి గ్రామానికి చెందిన పూల దేవేంద్ర(39) రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో సర్పంచ్ సుధాకర్, సంక్షేమ కార్యదర్శి రియాజ్, పంచాయతీ కార్యదర్శి ఓబులమ్మ మంగళవారం దేవేంద్ర ఇంటికి వెళ్లి భార్య పూలరెడ్డెమ్మకు వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సహాయంగా రూ.10వేలు అందించారు.

పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్

ధర్మవరం అర్బన్: క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, కళాశాల కమిటీ చైర్మన్ బండి వేణుగోపాల్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, దీక్షతో విద్యను అభ్యసించాలన్నారు. అనంతరం విద్యార్థినులు సినిమా పాటలకు నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు.

వ్యాపారులతో 10న సమావేశం

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఖాళీగా ఉన్న స్థలాలను అద్దెకిచ్చేందుకు ఈ నెల 10న డీఎం కార్యాలయంలో ఔత్సాహిక వ్యాపారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు డీఎం మైనోద్దీన్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 13 షాపుల స్థలాలు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ నెల 18న పుట్టపర్తిలోని జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో టెండర్లు నిర్వహిస్తారని తెలిపారు.

ముగ్గురు విద్యార్థులకు గాయాలు



తీవ్రంగా గాయపడ్డ గోపికృష్ణ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని గుట్టకిందపల్లిలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు గోపికృష్ణ, గణేష్, మహేష్ మంగళవారం సాయంత్రం తరగతులు ముగియగానే ఇంటికి టూవీలర్‌లో వెళ్తూ కొత్తపేట ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఆగి ఉన్న బొలెరో వాహనాన్ని ఢీకొన్నారు. గోపికృష్ణ తలకు తీవ్రగాయాలు కావడంతో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. స్వల్ప గాయాలైన గణేష్, మహేష్‌ను ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మొహర్రం..ఉప్పొంగిన భక్తిభావం

- భక్తిశ్రద్ధలతో జలధి కార్యక్రమం
- ఘనంగా పీర్ల స్వాముల ఊరేగింపు



చిల్లకొండయ్యపల్లి గ్రామంలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



రాప్తాడులో జలధికి వెళ్తున్న పీర్లు

తాడిమర్రి: మత సమరస్యానికి ప్రతీక అయిన మొహర్రం వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొన్ని రోజులుగా పీర్ల చావడిలో పూజలు అందుకున్న పీర్లను మంగళవారం జలధికి తరలించారు. తాడిమర్రి మండలం చిల్లకొండయ్యపల్లి గ్రామంలో పెద్దకాశీం, చిన్నకాశీం, యంగమునీ, హుస్సేన్ తదితర పీర్లు, నిడిగల్లులో కుల్లాయస్వామి, పెద్దకాశీం, చిన్నకాశీం తదితర పీర్లకు ముజావర్లు నూతన వస్త్రాలు, వెండి ఆభరణాలు తొడిగి, వివిధ రకాల పూలమాలలతో అలంకరించారు. సాయంత్రం 4 నుంచి 7 గంటలకు పీర్లను గ్రామంలో ఊరేంచారు. భక్తులు చెక్కెర చదివించి మొక్కులు తీర్చుకున్నారు.

రాప్తాడు: గూగూడు తర్వాత పీర్ల ఉత్సవాలకు ప్రసిద్ధి అయిన రాప్తాడులో పీర్లను జలధికి తరలించే కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. వేడుకలకు ఇతర ప్రాంతాలనుంచి భక్తులు తరలిరావడంతో రాప్తాడులో వీధులన్ని కిక్కిరిసిపోయాయి. సోమవారం రాత్రి ఎనిమిది గంటలకు పీర్ల చావిడి ముందు అగ్నిగుండం ఏర్పాటు చేసి మంగళవారం తెల్లవారుజామున 2 గంటల నుంచి 8 గంటల వరకు పీర్లను ఊరేగించారు. భక్తులు బెల్లపు ఉంటలను పీర్లపైకి విసిరి మొక్కులు తీర్చుకున్నారు. యువకులు, మహిళలు, చిన్నారులు, వృద్ధులు తారతమ్యం లేకుండా నృత్యాలు చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. ప్రజలు మిద్దెలు, మేడలు ఎక్కి పీర్ల స్వాములను చూసి భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

కనగానపల్లి: భానుకోట గ్రామంలో పీర్ల స్వాముల జలధిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లస్వాములను ప్రత్యేకంగా అలంకరించి అగ్నిగుండ ప్రవేశం చేయించారు. అనంతరం గ్రామంలో ఊరేగింపుగా పీర్లస్వాములను జలధికి తరలించారు.

పారదర్శకంగా ఇంటింటి ఓటరు సర్వే

- నిబంధనల మేరకు తొలగింపులు, సవరణలు
- పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ



మాట్లాడుతున్న ఆర్డీఓ భాగ్యరేఖ

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఇంటింటి ఓటరు సర్వేను పారదర్శకంగా చేపట్టాలని పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ ఆదేశించారు. తహసీల్దార్లు, అఖిల పక్ష నాయకులతో మంగళవారం సాయంత్రం పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ వరకూ బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే నిర్వహిస్తారన్నారు. డబుల్ ఓటర్లు, చనిపోయిన ఓటర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారిని గుర్తించి ఎన్నికల నిబంధనల మేరకు తొలగించాలన్నారు. నూతనంగా నమోదు చేసుకునే ఓటర్ల నుంచి నివాస, పుట్టిన తేదీ, ఆధార్, ఫొటోలను సేకరించాలన్నారు. వంద సంవత్సరాలు దాటిన ఓటర్లు, దివ్యాంగ ఓటర్లు, థర్డ్ జండర్ ఓటర్లను గుర్తిస్తున్నట్లు చెప్పారు. జీరో డోర్ నంబర్‌ను సరిచేస్తున్నట్లు చెప్పారు. ఈ సవరణలను బీఎల్‌ఓ యాప్, రిజిష్టర్‌లలో నమోదు చేస్తున్నట్లు చెప్పారు. స్వీప్ యాక్టివిటీ కింద డిగ్రీ కళాశాలల్లోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ మధుసూదనరెడ్డి, తహసీల్దార్లు నవీన్‌కుమార్, కరుణాకర్, రామాంజులరెడ్డి, డివిజనల్ అధికారి జిలాన్, డీటీలు నరసింహులు, తరుణ్‌తేజ్, హరి, రెహమాన్, వివిధ పార్టీల నాయకులు రంగారెడ్డి, రాయుడు, విజయ్ కుమార్ ఆంజనేయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న ఎంపీపీ రాము

ఎన్పీకుంట: ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ ఈటెరాము అధ్యక్షతన మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు సమస్యలపై ఏకరవు పెట్టారు. సభ్యులు సూచించిన సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ అధికారులకు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాత్రి సమయాలలో డాక్టర్లు అందుబాటులో ఉండాలని వైద్యుడికి ఎంపీపీ సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం కదిరి నుంచి తిరుపతికి ఎన్పీకుంట, రాయచోట మీదుగా బస్సు నడిపించాలని ఎంపీపీ ఆర్టీసీ అధికారులకు సూచించారు. కాగా ఎనర్జీ అసిస్టెంట్లు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. చాలా చోట్ల విద్యుత్ స్తంభాలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటిని మార్చాలని పలువురు కోరారు. జగనన్న లే అవుట్లలో అనర్హులను తొలగించి అర్హులకు న్యాయం చేయాలని సింగిల్‌విండో అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వంకమద్ది చెరువు తూము నుంచి దిగువకు నీరు విడుదల చేసి మూగజీవాలకు తాగు నీటి సౌకర్యం కల్పించాలని ఎంపీటీసీ తిమ్మారెడ్డి కోరారు. ఉపాధి హామీ, విద్య, వ్యవసాయం, సిరికల్చర్, హౌసింగ్, అటవీ శాఖల అధికారులు అభివృద్ధి పనుల గురించి సమావేశంలో వివరించారు. తహసీల్దార్ నరేంద్రకుమార్, ఎంపీడీఓ ఆదినారాయణ, తహసీల్దార్ నరేంద్రకుమార్, వైస్ ఎంపీపీలు కేశవరెడ్డి, సంపూర్ణ, ఎంపీటీసీ మగ్బూల్‌బీ, లక్ష్మీదేవి, క్రిష్ణమ్మ, కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ సుబహాన్, సర్పంచులు ఆంజినమ్మ, రాధ, దిల్షాద్, నాగమునీశ్వరనాయుడు, విష్ణుమూర్తి, వెంకటేశ్, చంద్రకళ పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

రామగిరి: సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ కర్రెన్న, మండల కన్వీనర్ రమేష్‌లు పేర్కొన్నారు. మాదాపురంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ సంపూర్ణ పోషణ కిట్లను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్, ఎస్సీసెల్ మండల కన్వీనర్ బండారు అనిల్‌కుమార్, నాయకులు వెంకటరెడ్డి, దాసరి మోహన్, గొల్లవెంకటేష్, బోయ ఆనంద్, టీచర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో కొళాయిల ధ్వంసం

ప్రశాంతి నిలయం: ఎనుములపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తాగునీటి కోసం నాడు-నేడు కింద ఏర్పాటు చేసిన కొళాయిలను దుండగులు ధ్వంసం చేశారు. ఘటనపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రోజూ రాత్రి వేళ పాఠశాల ఆవరణలో దుండగులు చేరి అపరిశుభ్రం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దుండగులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

'మణిపూర్' దోషులను శిక్షించండి



ఆర్డీఓ తిప్పేనాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న పాస్టర్లు

ధర్మవరం అర్బన్: మణిపూర్ జరిగిన అత్యాచారాలు, హత్యలకు బాధ్యులైన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ధర్మవరం యునైటెడ్ పాస్టర్స్ వెల్ఫేర్ సర్వీస్ సొసైటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ తిప్పేనాయక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు షేక్, కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, సాలొమోను, గ్రేసయ్య, సామ్యూల్, సుందర్‌సింగ్ పాల్గొన్నారు.

నులిపురుగులను నులిమేద్దాం



తలుపులలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పిల్లల ఆరోగ్యాలను దెబ్బతీసే నులిపురుగులను నిర్మూలిద్దామని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చెన్నారెడ్డి, సురేష్‌నాయక్, అప్తాలమిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప సూచించారు. పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో మంగళవారం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం, జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంపై ప్రిన్సిపాల్ నిర్మల జయచంద్రారెడ్డి సమక్షంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్‌మాత్రలను 1 నుంచి 2 ఏళ్లలోపు పిల్లలకు సగం మాత్ర, 2 నుంచి 19ఏళ్ల పిల్లలకు ఒక మాత్ర ఇవ్వాలన్నారు. 10వతేదీన మాత్రలు మింగని విద్యార్థులకు 17వతేదీన మాత్రలు మింగించాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

కనగానపల్లి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు నులిపురుగుల నివారణ మాత్రలు సరఫరా చేసినట్లు ఎంఈఓ అరుణమ్మ తెలిపారు. ఈ నెల 10న నిర్వహించే నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తారన్నారు. వీటిని ముందస్తుగా అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంపీడీఓ అలివేలమ్మ చేతుల మీదుగా మంగళవారం అందించారు. కార్యక్రమంపై స్థానిక కేజీబీవీలో వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేసినట్లు హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ఎస్ఓ రమాదేవి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ తప్పనిసరి

తలుపుల: పిల్లల్లో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పకుండా పంపిణీ చేయాలని వైద్యాధికారి మున్వర్‌బాషా సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మంగళవారం ఆయన పోస్టర్లు ఆవిష్కరించారు. వైద్యాధికారిణి సల్మా, ఎంపీపీ రఫినాయక్, ఎంపీడీఓ కిరణ్‌మోహన్ రావు, ఎంఈఓ వెంకట్రాముడు పాల్గొన్నారు.

తాడిమర్రి: నులిపురుగుల నివారణపై స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ కృష్ణప్రసాద్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు సూచించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ వాణిశ్రీ సీహెచ్ఓ కళావతి పాల్గొన్నారు.

లోక్ అదాలత్ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న న్యాయమూర్తి జయలక్ష్మి

కదిరి టౌన్: జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని లోక్ అదాలత్ న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి పిలుపు ఇచ్చారు. మంగళవారం కదిరి కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీసులతో జడ్జి సమావేశమై మాట్లాడారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకొని రాజీ మార్గంలో ఎక్కువ కేసులను పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లింగాల లోకేశ్వర్‌రెడ్డి, ఏపీపీ సాయికృష్ణ, ఎస్ఐలు పాల్గొన్నారు.

నేటినుంచి ఆజాది కా అమృత్ మహోత్సవం

కదిరి అర్బన్: కదిరి మండలంలో బుధవారం నుంచి ఆజాది కా అమృత్ మహోత్సవ్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అంజనప్ప మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా నా భూమి నాదేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9న ముత్యాలచెరువు, కేఎస్‌పాళెం, 10న ఎగువపల్లి, కదిరి బ్రాహ్మణపల్లి, చవిటి తండా, చిగురుమానుతండా, 11న కుమ్మరవాండ్లపల్లి, మొటుకుపల్లి, బూరుగుపల్లి, చలమకుంట్లపల్లి, 14న కదిరి కుంట్లపల్లి, కాళసముద్రం, యర్రదొడ్డి, పట్నం గ్రామాల్లో వేడుకలు ఉంటాయని తెలిపారు.

తాడిమర్రి: మండలంలో ఈనెల 15వరకు ఆజాది కా అమృత్ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మీ పేర్కొన్నారు. బుధవారం తాడిమర్రిలోని జెడ్పీహెచ్ఎస్, నిడిగల్లు ఎంపీయూపీఎస్, పిన్నదరి జెడ్పీహెచ్ఎస్, ఏకపాదంపల్లి గ్రామంలో ఎంపీయూపీలో నిర్వహిస్తారన్నారు. 10న నార్శింపల్లి, ఆత్మకూరు, ఎం.అగ్రహారం, సీసీ రేవు, 11న కునుకుంట్ల, రామాపురం, చిల్లవారిపల్లి, 14న పెద్దకోట్ల, చిల్లకొండయ్యపల్లి, దాడితోటలో కార్యక్రమాలు ఉంటాయి.

కనగానపల్లి: నా భూమి- నా దేశం కార్యక్రమాన్ని బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఏపీఓ వెంకటేష్ నాయక్, ఎంపీడీఓ అలివేలమ్మ తెలిపారు. తొలిరోజు బుధవారం కనగానపల్లి, ముక్తాపురం, మామిళ్లపల్లి, ముత్తువకుంట్ల గ్రామాల్లో, గురువారం తగరకుంట, పాతపాళ్యం, నరసంపల్లి, బద్దలాపురం, ఎలకుంట్ల గ్రామాల్లో, 11న తూంచర్ల, భానుకోట, వేపకుంట, కొండపల్లి, 14న కేఎస్ పాళ్యం, మద్దెలచెరువు, దాదులూరు, కోనాపురం, కుర్లపల్లి తాండా గ్రామాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

సంక్షిప్త సమాచారం

సీసీ రోడ్డు పనుల పరిశీలన



పనులు పర్యవేక్షిస్తున్న వేముల జయరామిరెడ్డి

ధర్మవరం: పట్టణంలోని 2వవార్డులో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి పరిశీలించారు. పనులను నాణ్యతతో చేపట్టాలని, సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. వాటర్ పైపులైన్ రిపేర్ చేయించారు.

అక్కదేవతల ఆలయానికి విరాళం

అమడగూరు: ఓడీచెరువు మండలంలోని దాదిరెడ్డిపల్లి వద్ద నిర్మిస్తున్న అక్కదేవతల ఆలయానికి గోరంట్లకు చెందిన చంద్రశేఖర్, విజయలక్ష్మి, లక్ష్మీనారాయణ, కమలమ్మ దంపతులు రూ.లక్ష విరాళం ప్రకటించారు. మంగళవారం ఆలయ పూజారి వెంకటేష్ చేతికి విరాళాన్ని అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

అమడగూరు: ఓడిచెరువు మండలంలో మహమ్మదాబాద్ క్రాస్ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సెబ్ సీఐ శ్రీధర్, ఎస్ఐలు జబీవుల్లా, గోపి తెలిపారు.

దోమల నియంత్రణకు మందు పిచికారీ

ఎన్పీకుంట: కదిరి మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజులు మంగళవారం పాపన్నగారిపల్లి, బండారుచెట్లపల్లి గ్రామాల్లో వైద్యసిబ్బందితో కలిసి పర్యటించారు. దోమల నివారణకు పైరత్రియం, అబెట్ మందును పిచికారీ చేయించారు.

ఏఐఎల్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడిగా ప్రసాద్



ప్రసాద్

ధర్మవరం అర్బన్: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఏఐఎల్‌యు) జిల్లా ఉపాధ్యక్షుడుగా ధర్మవరం పట్టణానికి చెందిన ఇడపబత్తి ప్రసాద్ ఎంపికయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు.

నవ్వుల సమయం సంఘం వార్షికోత్సవం

కదిరి టౌన్: పట్టణంలోని శ్రీ వాసవీ ఆర్యవైశ్య కల్యాణమండపంలో నవ్వుల సమయం సంఘం ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, అనంతపురం లక్ష్మీనారాయణ, నాగరాజు హజరై మాట్లాడారు. అనంతపురం నుండి విచ్చేసిన ఔత్సాహిక కళాకారులు సినీ గీతాలు ఆలపించారు. బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఉమామహేశ్వర్, రిటైర్డ్ లెక్చరర్ రవికుమార్, ఎం.లక్ష్మీనారాయణ, శ్రీదేవి, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ విజేతలకు అభినందనలు



ధర్మవరంలో జరిగిన పోటీల్లో సత్తా చాటిన విద్యార్థినులు



బత్తలపల్లి: ప్రతిభ కనబర్చిన విద్యార్థినులతో ఉపాధ్యాయ బృందం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించిన ధర్మవరం డివిజన్ అథ్లెటిక్స్ పోటీల్లో కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. లాంగ్‌జంప్‌లో తానియ ప్రతిభ చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. అదేవిధంగా నవ్య 100 మీటర్లు, బృందా 200 మీటర్లు, నవ్య 400 మీటర్ల పరుగు పందెంలో విజేతలుగా నిలిచారు. విజేతలను పాఠశాల హెచ్ఎం మేరివరకుమారి, ఇన్‌చార్జ్ హెచ్ఎం శారద, పీఈటీ అశ్వని అభినందించారు.

బత్తలపల్లి: ఆర్డీటీ ఆధ్వర్యంలో బత్తలపల్లిలోని ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో నిర్వహించిన బాలికల అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. 400 మీటర్ల పరుగు పందెంలో సౌమ్య మొదటి స్థానం, 100 మీటర్స్ విభాగంలో భావన, 200 మీటర్స్ విభాగంలో అనిత, లాంగ్‌జంప్‌లో చరిత, 400 మీటర్ల రిలే పరుగు పందెంలో సౌమ్య, అనిత, చరిత, భావన మూడో స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు వెంకటనాయుడు, పీడీ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

10న ముత్యాలమ్మ ఆలయ దుకాణాల వేలం

రామగిరి: నసనకోట ముత్యాలమ్మ ఆలయ సమీపంలోని దుకాణాల వేలం ఈనెల 10న ఉంటుందని ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వేలంపాటలో పాల్గొనదలిచిన వారు ఆలయ కమిటీ నిర్ణయించిన డిపాజిట్ చెల్లించాలన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

నల్లచెరువు: మండల కేంద్రంలోని రైల్వేగేట్ వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పక్కా సమాచారంతో ఎస్ఐ వరలక్ష్మి మంగళవారం తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు.రహంతుల్లా, అమ్మాజి, ఆంజనేయులు అనే వారిని అరెస్ట్ చేసి 24 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

రీ సర్వే పక్కాగా చేపట్టండి

గాండ్లపెంట: జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్షా పథకం కింద భూముల రీ సర్వేను పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ హమీద్‌బాషా సూచించారు. మండలంలోని జీనులకుంట, మడుగువారిగొంది, సామచేనుబైలు గ్రామాల్లో చేపట్టిన భూ సరీ సర్వేపై మంగళవారం ఆయన తన కార్యాలయంలో మండల సర్వేయర్, గ్రామ సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. భూ సర్వే సమయంలో రైతులకు సమాచారం అందజేయాలన్నారు.

ఆపన్నహస్తం



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: కొత్త చెరువు మండలం వంగంపల్లి గ్రామంలో కొద్ది రోజుల క్రితం గ్యాస్ ప్రమాదంలో మృతి చెందిన రాజేశ్వరి అనే మహిళ కుటుంబానికి పలువురు ఆపన్నహస్తం అందించారు. గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు రూ.25 వేలు సేకరించి మృతురాలి కుటుంబానికి అందజేశారు. ఏంజెల్స్ జాయ్ ట్రస్ట్ నిర్వాహకులు వినాయక్, హరిగోపాల్ రూ.10వేల విలువ చేసే వస్త్రాలు, సరుకులు పంపిణీ చేశారు. గ్రామస్తులు గోపి, రాజు, వెంకటాద్రి, సుధాకర్, గురుమూర్తి పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు



నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామ పంచాయతీ 3వ వార్డు మెంబరు స్థానానికి మంగళవారం లింగప్ప అనే వ్యక్తి నామినేషన్ వేశారు. నామినేషన్ పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఖాదర్ బాషాకు అందజేశారు. సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, వెంగళరెడ్డి పాల్గొన్నారు.

వార్డు మెంబర్ ఎన్నికకు నోటిఫికేషన్

బత్తలపల్లి: తంబాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని 3వ వార్డు మెంబర్(బీసీ మహిళ) ఎన్నికకు రిటర్నింగ్ అధికారి దివాకర్ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. తొలి రోజు ఎలాంటి నామినేషన్ దాఖలు కాలేదు. గురువారం సాయంత్రం వరకు నామినేషన్లు స్వీకరిస్తామని ఆయన తెలిపారు.

గ్రంథాలయం తనిఖీ



రామగిరి గ్రంథాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న సంస్థ కార్యదర్శి రమ

రామగిరి: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని సంస్థ కార్యదర్శి రమ మంగళవారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులో ఉంచాలన్నారు. పుస్తకాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, గ్రంథాలయ పన్ను వసూలు చేయాలని, విద్యార్థులతో సభ్యత్వం చేయించి, పాఠకుల సంఖ్య పెంచాలన్నారు. గ్రంథాలయ అధికారి వెంకటేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైస్ చైర్మన్లకు సన్మానం

ధర్మవరం: నూతనంగా ఎంపికైన మున్సిపల్ వైస్ చైర్మన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగంను ధర్మవరం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మంగళవారం మెప్మా సీఓలు, ఆర్పీలు ఘనంగా సన్మానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి పాల్గొన్నారు.